## క్లుప్తంగా

### ఆలయంలో ఎమ్మెల్యే పూజలు



నాగ్సాన్‌పల్లి ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని నాగ్సాన్‌పల్లి సమీపంలో జాతీయ రహదారి పక్కన గల ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం ఎమ్మెల్యే సునీతారెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. మహ్మద్‌నగర్ గ్రామానికి చెందిన బాన్స్‌వాడ ప్రతాప్‌రెడ్డి ఎమ్మెల్యే ఎన్నికల్లో సునీతారెడ్డి గెలుపొందాలని మొక్కుకోవడంతో ఈరోజు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రామాగౌడ్, నాయకులు గోవర్ధన్ రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, సంతోష్‌గౌడ్, మత్రి శ్రీనివాస్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

### ఆహ్వాన పత్రిక అందజేత

వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రం వెల్దుర్తిలో గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 31 నుంచి జూన్ 2 వరకు గంగాభవాని దేవాలయ 36వ వార్షికోత్సవాలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఆహ్వాన పత్రికను మంగళవారం సంఘం నాయకులు నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డికి అందజేశారు. ఆలయ వార్షికోత్సవ వేడుకలకు హాజరై అమ్మవారి కృపా, కటాక్షాలు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పరమేశ్, బాలరాజు, నగేష్, సాయిబాబా, మల్లేశం, రమేశ్, శివకృష్ణ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

### ఉచిత పాఠ్య పుస్తకాలు సిద్ధం

వెల్దుర్తి(తూప్రాన్): ప్రభుత్వ పాఠశాలల పునః ప్రారంభం రోజునే విద్యార్థులకు పాఠ్య, నోట్ పుస్తకాలు అందించనున్నట్లు ఎంఈఓ యాదగిరి పేర్కొన్నారు. 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 1917 మంది విద్యార్థులకు గాను 18,663 నోట్ బుక్స్ ఎంఆర్‌సీ కార్యాలయానికి వచ్చాయి. వాటిని ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు అందజేస్తున్నట్లు తెలిపారు. 2024 - 25 విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే జూన్ 12న అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు టెక్ట్స్ బుక్స్, నోట్ బుక్స్ పంపిణీ చేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

### వీర సావర్కర్‌కు నివాళి



వీరసావర్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తపస్ ఉపాధ్యాయ సంఘం నాయకులు

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంటలో తపస్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం వీరసావర్కర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలతో నివాళులు అర్పించారు. కార్యక్రమంలో తపస్ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా లక్ష్మణ్, తపస్ సంఘం నాయకులు వెంకటేశ్, రేఖ, అంజనేయులు, యాదగిరి, దేవానంద్, మధుసూదన్‌రెడ్డి, రాజేశ్వర్, ప్రవీణ్, రమేశ్, సుభాష్‌గౌడ్ సంతోష్ ఉన్నారు.

### నార్సింగి పోలీస్‌స్టేషన్ తనిఖీ

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి పోలీస్‌స్టేషన్‌ను తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ రికార్డులను పరిశీలించారు. పోలీస్‌లకు కాల్‌రోల్ నిర్వహించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులకు సహకరించి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని ఎస్‌ఐ అహ్మద్ మోహినొద్దీన్‌కు సూచించారు.

### 'సీఎంను విమర్శించడం తగదు'



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

నర్సాపూర్: ఎన్నికలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శించడం తగదని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రిజ్వాన్, మండలాధ్యక్షుడు మల్లేశ్ అన్నారు. వారు మంగళవారం ఈ సందర్భంగా మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలను, యువతను, రైతులను మోసం చేశారని బీఆర్‌ఎస్ నాయకుడు చంద్రాగౌడ్ ఆరోపించడాన్ని ఖండించారు. కాంగ్రెస్ పార్టీని విమర్శించే స్థాయి బీఆర్‌ఎస్‌కు లేదని వారన్నారు. రైతులు, ఆయా వర్గాల ప్రజల పక్షాన ఉంటూ వారి సమస్యలపై తమ నాయకులు గతంలో పోరాటం చేశారని వారు గుర్తు చేశారు. పార్టీ నాయకులు లలిత, సురేష్, శ్రీనివాస్‌గౌడ్, వినోద, అశోక్‌గౌడ్, అజ్మత్ పాల్గొన్నారు.

### 'వర్మి కంపోస్టు' తయారు చేసుకోవాలి

చిలప్‌చెడ్(నర్సాపూర్): డంప్ యార్డుల్లో తడి చెత్తను వేరు చేసి వర్మి కంపోస్టు ఎరువులు తయారు చేయాలని డీఎల్‌పీఓ యాదయ్య అన్నారు. మంగళవారం మండల పరిధిలోని అంతారం, శీలాంపల్లి గ్రామాల్లోని డంప్ యార్డులు, శ్మశాన వాటికలు, పల్లె ప్రకృతి వనాలు, నర్సరీలను ఆయన సందర్శించారు. అనంతరం గ్రామ పంచాయతీల్లో రికార్డులను తనిఖీ చేశారు. ఎంపీఓ శరత్‌కుమార్‌రెడ్డి, కార్యదర్శులు రవిశంకర్, భూమేష్ పాల్గొన్నారు.

# నకిలీ విత్తనాలపై అవగాహన



కౌడిపల్లి(నర్సాపూర్): రాజిపేటలో విత్తన కొనుగోలుపై అవగాహన కల్పిస్తున్న ఏఈఓ రాజశేఖర్‌గౌడ్

హవేళిఘణాపూర్(మెదక్): రైతులు నకిలీ విత్తనాలపై అప్రమత్తంగా ఉండాలని ఏఓ నాగమాధురి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని శమ్నాపూర్, రాజ్‌పేట, సర్దన, జక్కన్నపేట, నాగాపూర్, సుల్తాన్‌పూర్ గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసిన తర్వాత రశీదును తప్పనిసరిగా భద్రపర్చుకోవాలన్నారు. ఏఈవో ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

**నకిలీవి విక్రయిస్తే క్రిమినల్ కేసులు**

అల్లాదుర్గం(మెదక్): నకిలీ విత్తనాలు విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని, నకిలీ విత్తన విక్రయాలు అరికట్టేందుకు ఫర్టిలైజర్ దుకాణాలపై దాడులు చేస్తున్నట్లు సీఐ రేణుక చెప్పారు. మంగళవారం అల్లాదుర్గం ఫర్టిలైజర్ దుకాణాల్లో అకస్మిక తనిఖీ నిర్వహించి విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు పరిశీలించారు. ఎవరైన నకిలీ విత్తనాలు తెస్తే వెంటనే 100 నంబర్‌కు, పోలీసులకు వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏఓ రాజేశ్‌కుమార్, ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.

**గుర్తింపు ఉన్న డీలర్ల వద్దనే**

**కొనాలి : ఏఈఓ రాజశేఖర్‌గౌడ్**

కౌడిపల్లి(నర్సాపూర్): రైతులు గుర్తింపు ఉన్న డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలని ఏఈఓ రాజశేఖర్‌గౌడ్ తెలిపారు. మంగళవారం మండలంలోని రాజిపేట, వెంకటాపూర్(ఆర్), పీర్యతండా, కొట్టాల, కంచన్‌పల్లి గ్రామాలలో విత్తన కొనుగోలుపై వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. ఆయా గ్రామాల్లో ఏఈఓలు దివ్యశ్రీ, రాజశేఖర్‌గౌడ్ రైతులకు అవగాహన కల్పించారు.

**చిన్నశివునూర్‌లో..**

చేగుంట(తూప్రాన్): మండలంలోని పలు గ్రామాల్లో వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పించారు. చిన్నశివునూర్, వడియారం, చందాయిపేట, బీకొండాపూర్ గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో మండల వ్యవసాయ అధికారి హరిప్రసాద్, ఏఈఓలు, ఆయాగ్రామాల రైతులు పాల్గొన్నారు.

**టేక్మాల్‌లో..**



అల్లాదుర్గంలోని ఫర్టిలైజర్ దుకాణంలో తనిఖీ చేస్తున్న సీఐ, ఏఓ

టేక్మాల్(మెదక్): ఫర్టిలైజర్ దుకాణాల్లో రైతులకు నాణ్యమైన విత్తనాలను విక్రయించాలని ఎస్‌ఐ మురళి తెలిపారు. మంగళవారం టేక్మాల్‌లోని పలు ఫర్టిలైజర్‌లను మండల వ్యవసాయాధికారి రాంప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. ఫర్టిలైజర్‌ల్లోని రికార్డులను, స్టాక్ బోర్డులను పరిశీలించారు.

## కంకర మిషన్‌కు అనుమతి ఇవ్వొద్దు



ఎంపీడీఓకు వినతి పత్రం ఇస్తున్న కామారం తండా గిరిజనులు

- అక్రమ బ్లాస్టింగ్‌పై చర్యలు తీసుకోవాలి
- కామారం గిరిజనుల డిమాండ్

చిన్నశంకరంపేట(మెదక్): గ్రామ సమీపంలో తమ పొలాలకు ఇబ్బందులు కలిగించే కంకర మిషన్ ఏర్పాటుకు అనుమతులు ఇవ్వొద్దని మండలంలోని కామారం గిరిజనులు అన్నారు. మంగళవారం చిన్నశంకరంపేట తహసీల్దార్, మండల పరిషత కార్యాలయం ఎదుట వారు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ దామోదర్, తహసీల్దార్ మన్నన్‌లకు వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పెద్ద పెద్ద గుట్టలను అక్రమంగా బ్లాస్టింగ్ చేస్తున్న అనంతరెడ్డిపై చర్యలు చేపట్టి పంట పొలాల్లోని వ్యవసాయ బోరుబావులను కాపాడాలన్నారు. ప్రభుత్వ భూమిలోంచి రోడ్డు వేసేందుకు అనుమతి ఇవ్వాలని జీపీ కార్యదర్శిపై ఒత్తిడి తెస్తున్న అనంతరెడ్డి, అతనికి సహకరిస్తున్న వారిపై చర్యలు చేపట్టి న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మోహన్‌నాయక్, రవిచంద్, ఎంపీటీసీ సక్కుబాయి, తాజామాజీ సర్పంచ్ లక్ష్మీరాములునాయక్, గణేశ్, రవిందర్, సక్రునాయక్, సేనాపతి, కిషన్‌నాయక్, గోపాల్‌నాయక్, రుక్యానాయక్, బీమా నాయక్ ఉన్నారు.

## పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి



ట్రాన్స్‌కో ఎస్‌ఈకి వినతిపత్రం ఇస్తున్న సంఘం బాధ్యులు

మెదక్‌జోన్: తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ విద్యుత్, ఆర్టిజన్స్ కార్మికులకు సంబంధించి ఏళ్ల తరబడి డీఏ, ఏరియల్స్ పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే చెల్లించాలని యూనియన్ గౌరవాధ్యక్షుడు మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం యూనియన్ బాధ్యులతో కలిసి మంగళవారం ట్రాన్స్‌కో ఎస్‌ఈ జానకిరాములుకు అందించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు నర్సింలు, శ్రీశైలం, సలీం, సురేష్, రాజు, బాలరాజు, శ్రీనివాస్, దశరథ, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

## నాలుగు గ్రామాలు.. 800 మంది కూలీలు

- ఒకే ఒక్క ఫీల్డ్‌అసిస్టెంట్
- హాజరు సక్రమంగా వేయడం లేదని కూలీల ఆందోళన



ఆందోళన చేస్తున్న ఉపాధి కూలీలు

అల్లాదుర్గం(మెదక్): నాలుగు గ్రామాల్లో 800 కూలీలకు ఒకే ఒక్క ఫీల్డ్‌అసిస్టెంట్ విధులు నిర్వహిస్తూ.. పని ప్రదేశంలో హాజరు సక్రమంగా వేయడం లేదని కూలీలు మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఈ సంఘటన మంగళవారం అల్లాదుర్గంలో చోటు చేసుకుంది. అల్లాదుర్గం, నడిమితండా, గొల్లకుంట తండా, కోమటికుంట తండాకు కలిపి ఉపాధిహామీ పనులు చేయించేందుకు ఒకే ఒక్క ఫీల్డ్‌అసిస్టెంట్ ఉన్నారు. కూలీ పనికి వెళ్లితే ఫీల్డ్‌అసిస్టెంట్ సక్రమంగా హాజరు వేయడం లేదని కూలీలు మండల పరిషత్ కార్యాలయంలో అతనిపై ఫిర్యాదు చేశారు. దీంతో కూలీలకు, ఫీల్డ్‌అసిస్టెంట్‌కు మధ్య వాగ్వాదం జరిగింది.

## చట్టాలపై అవగాహన

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని పైతర గ్రామంలో మంగళవారం ఉపాధి హామీ కూలీలకు మహిళా శిశు సంక్షేమ శాఖ, స్వార్డ్ స్వచ్ఛంద సమస్వయంతో సఖి కేంద్రం ఆధ్వర్యంలో మహిళ హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించారు. సఖి కేంద్రం కేస్ వర్కర్ కళావతి, పారా మెడికల్ లక్ష్మీ గృహహింస, వరకట్న వేధింపులు, అత్యాచారాలు, యాసిడ్ దాడులు మొదలైన వాటి నుంచి మహిళలు రక్షణ పొందేందుకు సఖి కేంద్రానికి నేరుగా కానీ టోల్ ఫ్రీ నెంబర్ 181 ద్వారా సంప్రదించాలన్నారు. కుటుంబ సమస్యలపై అవగాహన కల్పించేందుకు టోల్ ఫ్రీ నెంబర్ 1098కు, సైబర్ నేరాల ఫిర్యాదుకై టోల్ ఫ్రీ నెంబర్ 1930 కి కాల్ చేయాలన్నారు. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు టోల్ ఫ్రీ నంబర్లను 181, 112, 1098, 18004198588, 1930 సంప్రదించాలని సూచించారు.

### 30 నుంచి వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు

మెదక్ మున్సిపాలిటీ: పట్టణంలోని వేంకటేశ్వర స్వామి దేవాలయంలో 30 నుంచి 34వ బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ వంశానుగ్రత ధర్మకర్త కంచి మధుసూదన్ ఒకప్రకటనలో తెలిపారు.

### ఇష్టారాజ్యంగా మాంసం అమ్మకాలు

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటలో చికెన్, మటన్ మాంసం అమ్మకాలు వ్యాపారు ఇష్టారాజ్యంగా నిర్వహిస్తున్నారు. పలు చికెన్ దుకాణాల్లో అనారోగ్యానికి గురైన కోళ్లను (వీక్ బర్డ్స్) మాంసం అమ్మకాలు జరుపుతున్నారని పలువురు వినియోగదారులు వాపోయారు. అన్ని శాఖల సిబ్బంది ఉంటే మండల కేంద్రంలోనే ఇలాంటి విక్రయాలకు పాల్పడుతుంటే ఇక గ్రామాల్లో ఎలాంటి మాంసం అమ్మకాలు జరుపుతున్నారో అర్థం అవుతుంది. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో నాసిరకం జీవాల మాంసం విక్రయాలు జరుపుతున్నట్లు వినియోగదారులు ఆరోపించారు. ఈ విషయం పశు వైద్యాధికారి సంధ్య దృష్టికి తీసుకెళ్లగా... తనిఖీలు చేపట్టి నాణ్యమైన మాంసం విక్రయాలు జరిగేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

### ఎకరాకు 12 క్వింటాళ్ల జొన్నల కొనుగోలు

రేగోడ్(మెదక్): జొన్నలు కొనుగోళ్ల పెంపుపై హర్షం వ్యక్తం చేస్తున్నట్లు పీసీసీ సభ్యుడు మున్నూరు కిషన్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దిగంబర్‌రావ్ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం మంత్రి దామోదర రాజనర్సింహ కృషితో ఎకరానికి 12 క్వింటాళ్ల జొన్నలు కొనాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించిందని వారు చెప్పారు.

### పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఋతుక్రమ సమయంలో మహిళలు పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని చిలప్‌చెడ్ పల్లె దవాఖాన హెల్త్ సెక్రటరీ డాక్టర్ ప్రతిమ అన్నారు. మంగళవారం ప్రపంచ ఋతు పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా చిలప్‌చెడ్ గ్రామ మహిళలకు, బాలికలకు ఋతుక్రమం సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. మహిళలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, మహిళలు పాల్గొన్నారు.



మహిళలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ప్రతిమ

## వారం రోజుల్లో కొనుగోళ్లు పూర్తిచేస్తాం



చిట్కుల్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద తహసీల్దార్ ముసాద్దీక్

చిలప్‌చెడ్(నర్సాపూర్):. ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు ఆధైర్య పడాల్సిన అవసరం లేదని, వారం రోజుల్లో మండలంలోని అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లు పూర్తి చేస్తామని తహసీల్దార్ ముసాద్దీక్ అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని చిట్కుల్, గౌతాపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో ధాన్యం కొనుగోళ్లు కొంత ఆలస్యమైన త్వరలోనే పూర్తిస్థాయి కొనుగోళ్లు చేస్తామన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## అమ్మ ఆదర్శ కమిటీ పనుల వేగం పెంచండి

డీఈఓ రాధా కిషన్



పొడిచన్‌పల్లిలో పనులు ప్రారంభిస్తున్న డీఈఓ

పాపన్నపేట(మెదక్): అమ్మ ఆదర్శ కమిటీ పనులు పాఠశాలలు తెరిచే నాటికి పూర్తి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి రాధాకిషన్ సూచించారు. మంగళవారం ఆయన ఎంఈఓ నీలకంఠంతో కలసి పాపన్నపేట మండలంలోని ఎల్లాపూర్, పొడిచన్‌పల్లి, అర్కెల, తమ్మాయిపల్లి, లక్ష్మీనగర్ పాఠశాలల్లో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనులు నాణ్యతగా ఉండాలన్నారు. ఆయన వెంట కాంప్లెక్స్ హెచ్‌ఎం సురేందర్, నవాజ్ రెడ్డి ఉన్నారు.

టేక్మాల్(మెదక్): పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీ పనులను వేగం పెంచాలని జిల్లా విద్యాధికారి రాదాకిషన్ తెలిపారు. మంగళవారం మండలంలోని గొల్లగూడెం ప్రాథమిక పాఠశాలలో సంపు పరిశీలించారు. అనంతరం మండల వనరుల కేంద్రంలో సీఆర్‌పీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలల్లో జరుగుతున్న పనులు నాణ్యతతో పూర్తి చేయాలన్నారు. ఇందులో ఎంఈఓ నీలకంఠం, మండల నోడల్ అధికారి విశ్వనాథం, సీఆర్‌పీలు శివరాజ్, మొగులయ్య, సాయిలు, ఎంఐఎస్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా శ్రీనివాసుడి కల్యాణం



శ్రీనివాసుడి కల్యాణోత్సవంలో భక్తులు

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని సంగాయిపేట గ్రామంలోని వేంకటాద్రిపై లక్ష్మీశ్రీనివాసుడి కల్యాణం మంగళవారం ఘనంగా జరిగింది. వేంకటాద్రిపై రంగంపేట ఆశ్రమ పీఠాధిపతి మాధవానంద స్వామి ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణం నిర్వహించారు. ఈవేడుకలకు నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి వేర్వేరుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి, ఎంపీపీ, జెడ్పీటీసీ మంజుల, మేఘమాల, మాజీ సర్పంచ్ మానస, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్ రెడ్డి, నవాజ్‌రెడ్డి, వెంకట్ రెడ్డి, వెంకట్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## నేడు చాకరిమెట్లలో విశేష పూజలు



పూలను సిద్ధం చేస్తున్న మహిళలు

శివ్వంపేట(నర్సాపూర్): చిన్నగొట్టిముక్ల గ్రామ పరిధిలోని చాకరిమెట్ల అరణ్యంలో కొలువైన శ్రీ సహకార ఆంజనేయస్వామి ఆలయంలో బుధవారం విశేష పూజలు నిర్వహించేందుకు ముమ్మర ఏర్పాట్లు చేశారు. లోక కల్యాణార్థం ఉదయం 7 గంటల నుంచి మహా రుద్రం, సహస్ర శ్రీ సూక్తం, సహస్ర మన్యుసూక్తం, పురుష సూక్తం, లక్ష తమలార్చన, శ్రీ రమాసహిత సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించనున్నట్లు ఆలయ ఫౌండర్, చైర్మన్ ఆంజనేయ శర్మ తెలిపారు.

## వైభవంగా బోనాల ఊరేగింపు



పాపన్నపేట(మెదక్): కొత్తపల్లిలో బోనాలతో భక్తులు



మదూర్‌లో బోనం ఎత్తుకున్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్

పాపన్నపేట(మెదక్): మండల పరిధిలోని కొత్తపల్లిలో మంగళవారం గౌడ సంఘం ఆధ్వర్యంలో ఎల్లమ్మకు ఘనంగా బోనాలు ఊరేగించారు. అనంతరం వాటిని అమ్మవారికి సమర్పించారు.

**నాగ్సాన్‌పల్లిలో..**

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని నాగ్సాన్‌పల్లిలో కొలువైన ఎల్లమ్మ ఉత్సవాలు జరుగుతున్నాయి. 35వ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలతో పాటు బోనాలు ఊరేగించారు. ఎమ్మెల్యే సునీతారెడ్డి ఎల్లమ్మదేవిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, మాజీ సర్పంచ్ ఎల్లం, లింగం, కృష్ణ, తదితరులు ఉన్నారు.

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని మదూర్‌లో నల్లపోచమ్మ ఉత్సవాలు జరుగుతున్నాయి. మంగళవారం ఈ సందర్భంగా మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ అమ్మవారికి బోనం సమర్పించారు.

### అంగన్‌వాడీలో కుళ్లినగుడ్లు



పంపిణీ చేసిన పాడైన గుడ్లు

శివ్వంపేట(నర్సాపూర్): పోషకాహారంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రం నుంచి పంపిణీ చేసిన గుడ్లు కుళ్లిపోయి ఉండడంతో లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేశారు. మండల పరిధిలోని బీమ్లా పంచాయతీ శంకర్ తండాలోని మినీ అంగన్‌వాడీ సెంటర్ నుంచి మంగళవారం తండాకు చెందిన రెండేళ్ల బాలుడు అఖిల్‌కు టీచర్ 16 గుడ్లు అందజేసింది. ఇంటికి తీసుకెళ్లిన అనంతరం బాలుడికు గుడ్డు తినిపించేందుకు తల్లి ప్రయత్నిస్తున్న సమయంలో దుర్వాసన వచ్చింది. దీంతో పగలగొట్టి చూస్తే కుళ్లిపోయి ఉన్నాయని బాలుడు తల్లి స్వరూప చెప్పారు. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇష్టరాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

## సంక్షిప్త వార్తలు

**◆ కొండగట్టుకు పాదయాత్రగా హనుమాన్ స్వాములు**



నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని కల్వకుంట గ్రామంలో మంగళవారం 20 మంది హనుమాన్ స్వాములు కొండగట్టుకు బయలుదేరారు. కార్యక్రమంలో గురుస్వామి అందే మాధవారెడ్డి, రావిపల్లి రవీందర్‌రెడ్డి, కలచిగారి తిరుపతిరెడ్డి, మన్నే మహిపాల్, రంజిత్ కుమార్, మనోహర్, లక్ష్మీనందీశ్వర్ రెడ్డి, అందే సాత్విక్ రెడ్డి పాల్గొన్నారు.

**◆ ఎరువుల వివరాలు నమోదు చేయాలి**

పాపన్నపేట(మెదక్): ఫర్టిలైజర్ షాపుల నిర్వాహకులు తప్పనిసరిగా ఎరువులు, విత్తనాల వివరాలు నమోదు చేయాలని వ్యవసాయ శాఖ ఏడీ విజయనిర్మల సూచించారు. మంగళవారం పాపన్నపేట రేషన్ డీలర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. విత్తనాలు అమ్మినప్పుడు రైతులకు రశీదులు ఇవ్వాలని చెప్పారు. కార్యక్రమంలో ఏఈఓ కృష్ణ, ఏఓలు, డీలర్లు పాల్గొన్నారు.

**◆ రికార్డుల పరిశీలన**

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని టీ.మాందాపూర్ గ్రామ పంచాయతీ రికార్డులను, అలాగే గ్రామంలో ప్రభుత్వం నిర్వహించిన పనులను డీపీఓ యాదయ్య పరిశీలించారు. మంగళవారం అనంతరం ఆయన డంప్‌యార్డు, వైకుంఠధామం, నర్సరీని సందర్శించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ప్రమోద ఎంపీఓ కలిముల్లా ఉన్నారు.

**◆ మూడవ రోజు 96శాతం హాజరు**

మెదక్ కలెక్టరేట్: ఇంటర్ అడ్వాన్స్ పరీక్షల్లో భాగంగా మంగళవారం విద్యార్థులకు గణితం, వృక్షశాస్త్రం, పౌరశాస్త్రం పరీక్షలు జరిగాయి. మొదటి సంవత్సరంలో 2708 విద్యార్థులతో 95శాతం, ద్వితీయ సంవత్సరంలో 1068 మందితో 96 శాతం హాజరయ్యారు.

**◆ మాచవరంలో ఎన్టీఆర్ జయంతి వేడుకలు**

హవేళిఘణాపూర్(మెదక్): ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకొని మంగళవారం మెదక్ మండల పరిధిలోని మాచవరం గ్రామంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలవేసి నివాళులర్పించారు. పీఏసీఎస్ చైర్మన్ సీతారామయ్య, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ సాంబశివరావు, సుబ్బారావు, చెంచయ్య, వెంకట్రావ్, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

**◆ ఫోన్ దొంగల రిమాండ్**

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల్లో మైనర్‌బాలబాలికలను బెదిరించి ఫోన్ దొంగతనాలకు పాల్పడిన నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ నరేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 25న కౌడిపల్లి మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఇద్దరు మైనర్ అమ్మాయిలు, అబ్బాయిలు ఘనపురం ఆనకట్ట చూడటానికి వెళ్లారు. అదే సమయంలో అక్కడకు నాగ్సాన్‌పల్లి గ్రామానికి చెందిన గారంగుల యాదగిరి, అలకుంట్ల పోచయ్య, చాకలి రవీందర్, చిన్నఘనపూర్‌కు చెందిన వడ్డె నర్సింలు మైనర్లను భయపెట్టి డబ్బులు డిమాండ్ చేశారు. వారి వద్ద ఉన్న మూడు సెల్ ఫోన్లను లాక్కున్నారు. ఈ విషయమై బాధితులు చేసిన ఫిర్యాదుతో విచారణ చేసి వారి వద్ద నుంచి మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

**◆ సైబర్ నేరాలపై అవగాహన**

పెద్దశంకరంపేట(మెదక్): ప్రస్తుతం సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్‌బీఐ జనరల్ సెక్యూరిటీ ఆఫీసర్ ఆనందకుమారరాజు అన్నారు. మంగళవారం ఎస్‌బీఐలో ఖాతాదారులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఎస్‌బీఐ మేనేజర్ అతుల్ కృష్ణ, ఫీల్డ్ ఆఫీసర్ అశోక్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

**◆ చికిత్స పొందుతూ యువకుడి మృతి**

కొల్చారం(నర్సాపూర్): వారం రోజుల క్రితం విషం సేవించిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మండలంలోని నాయిని జలాల్పూర్ గ్రామంలో మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వంజరి సాయికృష్ణ (22) మెదక్ పట్టణంలో తల్లి మందలించడంతో మనస్తాపం చెంది పురుగుల మందును తాగాడు. గమనించిన తల్లి బాధితుడిని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ.. మృతి చెందాడని పోలీసులు తెలిపారు.